# పెద్ద గీత

'భావ తరంగిణి' మంత్లీ.. ఆగస్ట్, 2003



'నువ్వు నువ్వేనా?'

'యస్ నేనే... నేనంటే నేనే!'

'నువ్వు ఉండవలసిన వాడివిరా!'

'అందుకే కదరాాం... ఈ ఆరాటమంతా!'

ఒకనాడు హోసన్ తనను ఉద్దేశించి అన్నమాటలు గుర్తుకువచ్చేసరికి ఒకింత గర్వంగా ఫీలయ్యాడు అభిరామ్.

ఆ గర్వం అతనిలోని అతిశయాన్ని పెంచి పోషిస్తోంది...

ముఖంలో దర్పాన్ని ద్విగుణీకృతం చేస్తోంది.

హసన్ చిన్నప్పటినుండి వెన్నంటి ఉన్న స్నేహితుడు!

చిన్నతనంలో నైతేనేమి, కాలేజీలో చదివే రోజుల్లో నయితేనేమి, ఉద్యోగవేటలో నయితేనేమి– హసన్ అభిరామ్‌ను ఉత్తేజపరుస్తూ ఉండేవాడు. అతన్ని 'ప్రాణస్నేహితుడు' అనేకన్నా అభిరామ్‌లోని హైసెన్‌కి– 'సుపీరియారిటీ తెచ్చి ఈగోలకు ఊపిరులూదే ప్రాణమైన స్నేహితుడు' అంటే హేతుబద్ధంగా ఉంటుందేమో!?

అభిరామ్‌ది ప్రతివిషయంలోనూ భిన్న మనస్తత్వం!

తను అందరిలోనూ ఎలివేటెడ్‌గా ఉండాలని, 'తన గురించి అందరూ చర్చించుకోవాలి, తన ఉన్నతిని చూసి ఈర్ష్య పడా'లనుకొనే వ్యక్తిత్వం అతనిది. "ఏరా..! ఈ రేమాండ్స్ సూటు నీకు సరిపోయింది. నీకు మ్యాచింగ్ బాగుంది. నువ్వు వేసుకుంటే దానికే అందం వచ్చింది!" అని ఎవరైనా తన బట్టల గురించి మెచ్చుకుంటే పొంగిపోతుంటాడు.

ప్రతిక్షణం నలుగురితో అలా కీర్తింపబడాలని ఆశిస్తుంటాడు.

"అభీ! మేనేజరియల్ ఎకౌంటింగ్ పేపర్లో ఫిఫ్టీఫైవ్ పర్సెంట్ మార్కు్స స్కోరు చేయగలిగావు అంటే నాట్ ఎ జోక్! నీ అంత తెలివైనవాడే స్కోరు చేయగలడు. నీ ముందు మాలాంటి మట్టిబుర్రలు ఎంత చెప్పు?!"

– క్లాసులో ప్రక్కసీటులోని పాంచజన్య మాటలు తనలో ఎక్కడలేని దర్పాన్ని కలుగజేసేవి. ఆ క్షణంలో తనను మించినవారు ఎవరూ లేరనే ఊహ కలిగి– మదిలో మానస ధనం ఉవ్వెత్తున ఎగిసి పడుతూంటుంది.

మధ్యతరగతి మనిషి అయిన అభిరామ్‌ది చిత్రమైన మానసిక స్థితి! తనంతటివాడు లేడని... ఉండకూడదని... పట్టిన ప్రతిపనిలోనూ తానే గొప్ప అనిపించుకోవాలని... తద్వారా పదిమందిలో ఎలివేట్ కావాలనే తపన అతన్ని ముందుకు తీసుకెళ్ళి, ఇతను ఉండవలసిన 'మహామనిషి' అనే ముద్రవేసి పడేసింది.

ఆ ఊహలలోనే విహరించడం, ఆ 'ఈగో'తోనే సంతృప్తి చెందడం నిత్యకృత్యమైపోయింది.

● ● ●

రోజులాగే ఆరోజు పార్కులో కూర్చున్న అభిరామ్‌కు హసన్, పాంచజన్యలు గుర్తుకు వచ్చేసరికి అతిశయం అవధులు దాటింది.

'పూర్‌ఫెలోస్... ఎక్కడ ఉన్నారో, ఎలా గెటాన్ అవుతున్నారో..! నన్ను చూసి నేర్చుకొని ఉండాల్సింది! అయినా– డర్టీఫెలోస్‌కి నా లెవెల్ ఎక్కడ నుంచి వస్తుంది? వాళ్ళ స్థాయి వాళ్ళది కాని!?' అనుకున్నాడు తనలో తాను.

"నమస్కారం అయ్యగారూ!"

అంకారావు పిలుపుతో ఊరిస్తూన్న ఊహల్ని వదిలి అటు చూశాడు.

దుమ్ముకొట్టుకుపోయిన బట్టలు, మాసిన గడ్డం, చెదిరిన జుట్టు, ఎరుపెక్కిన కళ్ళు, తీరువుగా లేని శరీర ఆకృతి, చీకటి కన్నా నల్లనయిన రంగు, చిరిగిపోయిన చేతిసంచీ!

అస్తవ్యస్తంగా ఉన్న అంకారావును చూసేసరికి– జుగుప్స కలిగింది అభిరామ్‌కి. తనని డిస్టర్బ్ చేసినందుకు తల ఎటో త్రిప్పుకున్నాడు.

"మన్నించాలి! నాలుగురోజుల నుండి కనిపించకపోయేసరికి– 'ఏమై ఉంటుందా...' అని అనుకుంటున్నా!"

"ఏమీ లేదులేవోయ్! ట్రెజరీ ఆఫీసు ఉద్యోగం కదూ... మాటలా మరి? ఎంత బాధ్యత!! అందులోనూ నెలలో మొదటివారం నాలాంటి సిన్సియర్ ఆఫీసర్‌కి తీరిక ఎక్కడుంటుంది?" తన్నుకొస్తున్న గొప్పదనాన్ని మాటలలో మరింత ఎలివేట్ చేస్తూ అన్నాడు.

"అవును... అభిరామ్ సారు! సారు సారే!"

ఆ మాటకు ఎందుకో... అతని పట్ల ఉత్సుకత తన్నుకొచ్చింది అభిరామ్‌లో!

"అవునండీ! మీలాంటి పెద్దలు ఇలా షికారుకి వచ్చి, అలా పార్కులో నలుగురికి మంచిమాటలు చెబితే అందరూ ఆనందిస్తారు. ఏమోగాని సారూ! నాలుగురోజులు కనబడక పోయేసరికి– మాకు ఏమీ తోచలేదు.

"అవునూ... ఈరోజు గ్యాస్ గోడౌన్‌కు సెలవనుకుంటా! మా ఇంట్లో గ్యాస్ నిండుకుంటే సిలెండర్ కోసం ఫోన్ చేస్తే ఎవరూ లిఫ్ట్ చేయలేదు!"

"ఎందుకు సార్! సాయంత్రం ఇలా చెవిన ఓ మాట పడేస్తే... రేపు బండి తీసుకొచ్చి పడేయనా! అయినా మీకు అంత శ్రమ ఎందుకు సార్?!"

"సరే... మీ అమ్మాయిని నర్స్ ట్రైనింగ్‌కి పంపిస్తున్నారు. ఫీజులకని నాలుగువేలు అప్పు అడిగావ్! ఏమైంది తరువాత?"

"............."

మాట్లాడకపోయేసరికి– అభిరామ్ అతన్నే గమనిస్తున్నాడు. చూస్తుంటే గ్యాస్‌సిలెండర్స్ సప్లై చేసే బాయ్ అయినా, చూడానికి చికాగ్గా, జుగుప్సగా ఉన్నా– తీసుకున్న డబ్బు తిరిగి ఇస్తాడన్న నమ్మకం కలుగుతోంది. కాకపోతే రోజూ కనిపించినప్పుడల్లా 'మీరు అంత గొప్పవారు... మీది ఇంత మంచిమనసు' అని అభిమానంగా మాట్లాడుతూంటే– తను ఒక గొప్పమనిషిగా ఫీలయి, ఆ పొగడ్తల గుబాళింపు కోసమే రోజూ సాయంత్రాలు షికారుకు వెళ్లేవాడు. నమ్మకం కుదిరిన మనిషికి చేబదులుగా అప్పు ఇవ్వడంలో పెద్దగా ఇబ్బంది లేదని నిర్ణయించుకున్నాడు.

"సరే లేవోయ్! రేపు ఉదయం ఇంటికి వచ్చి కావాల్సిన డబ్బు తీసుకెళ్లు!" డాబు నిండిన స్వరంతో అన్నాడు.

వినీ విననట్లు ఎటో చూస్తున్నాడు అంకారావు.

తను అన్నమాటలకి ఎగిరి గంతులేస్తాడనుకొన్న అభిరామ్ కొంచెం నిరుత్సాహపడ్డాడు.

'ఫరవాలేదు... ఊరికే నీకు ఇవ్వడం లేదు... అప్పు మాత్రమే కదా... తీసుకో!"

"క్షమించండి అయ్యగారూ! ఫీజు కట్టాల్సిన కంగారులో అడిగినమాట వాస్తవమే! కాని, లేనివాడినయినా నా ఉద్దేశాలు, పద్ధతులు నాకున్నాయ్. తమరు ఏమీ అనుకోనంటే– మా అయ్య నెలనెలా ఫించను కోసం ట్రెజరీ ఆఫీసుకు రావడం మీకు తెలియంది కాదు. అయ్యకు వచ్చే ఆరువందల రూపాయల ఫించనులో మీరు అరవైరూపాయలు దండుకోవడమూ అబద్ధం కాదు.

మిమ్మల్ని అనదగ్గ వాడిని కాకపోయినా– ఇలా వయసుడిగిపోయిన వాళ్ళని హింసించి, అక్రమంగా మామూళ్ళు వసూలు చేసుకోవడం.., ఆ పాపపు సొమ్ముని నా కూతురికి ఫీజు

కట్టడానికి తీసుకోవడం... ఎందుకో ఇష్టం అనిపించలేదు. అందుకే మా ఆవిడ పుస్తెలు తాకట్టు పెట్టి, ఆ డబ్బుతో కూతుర్ని నర్స్‌కోర్సులో చేర్పించాను. మా తీరు పేరుకు 'పేద' అయినా నిజానికి నిప్పు!"

చెంప ఛెళ్ళుమనిపించినట్లయింది అభిరామ్‌కి.

మనసు అతలాకుతలం అవసాగింది. ఆ ప్రకంపనల ప్రభావానికి అతనిలో తిష్టవేసిన అహంకారం... గర్వం... డాబు... దర్పం... అన్నీ కూలిపోతున్న భావన కలగసాగింది.

తానో అతీతమైన వాడినన్న భావన అంకారావు నిజాయితీ, మంచితనాల ముందు తుడిచిపెట్టుకుపోతోంది. చూడ్డానికి జుగుప్స కల్గించే ఆ వ్యక్తిలోకి తొంగిచూసేసరికి- తాను ఎంత అనామకమైన ప్రవృత్తిని సంతరించుకున్నాడో అవగతమవసాగింది.

అవును! సిలెండర్ తీసుకొచ్చినప్పుడల్లా అణాపైసలతో మిగిలిన సొమ్ముల్ని లెక్క చూసి ఒప్పజెప్పే అతని తీరు సిగ్గుపడేలా చేస్తోంది. తనో స్వార్థం, సంకుచితత్వాల పటంలో ఇరుక్కొని, అదే ఒక ఉన్నత శిఖరమనుకొని, దానికి మించిన ఎత్తు మరోటి లేదని ఇన్నాళ్లూ భ్రమపడ్డాడు. కానీ, అంబరాన్నంటే ఆకాశ సౌధాలు కళ్ళముందు కనిపిస్తుంటే కనుపాపలు కంపిస్తున్నట్లుంది. సాటిమనుషుల ఉన్నతిని చూడలేక తనకుతాను గీసుకున్న గీత పెద్దదని అపోహపడ్డాడు. కానీ, మూర్తీభవించిన అంకారావు వ్యక్తిత్వ పరిమళం ముందు తన అజ్ఞానపు రేఖ కుచించుకు పోతున్నట్లుంది.

ఒక్కసారి అతని వైపు చూడబోయాడు...

అప్పటికే స్థిరమైన సదాశయంతో అడుగులో అడుగు వేసుకుంటూ ముందుకు సాగుపోతూ కన్పిస్తున్నాడు.